
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట









## 2030 నాటికి బాలల అక్రమ రవాణా రహిత

# భారత్ లక్ష్యం

- అక్రమ రవాణాదారులపై చట్టపరమైన చర్యలు
- రక్షించబడిన పిల్లలకు సమగ్ర పునరావాసం
- వనపర్తి, గద్వాల, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు
- రూరల్ డెవలప్మెంట్ సొసైటీ డైరెక్టర్ చిన్నమ్మ తామస్



**వనపర్తి, ఆగస్టు 1, (ప్రజాజ్యోతి):** ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వనపర్తి, జోగులాంబ గద్వాల, మహబూబ్‌నగర్ జిల్లాల్లో బాలల అక్రమ రవాణాను అరికట్టేందుకు రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్ణాయక జాతీయ ప్రచారానికి శ్రీకారం చుట్టారు. దేశవ్యాప్తంగా 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జీ=జ)' నెట్‌వర్క్ చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఈ మూడు జిల్లాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంస్థ ప్రకటించింది. బాలల అక్రమ రవాణా ప్రమాదం ఉన్న కుటుంబాలను గుర్తించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అనుసంధానం చేయడంతో పాటు పిల్లలు చదువు మానకుండా చర్యలు తీసుకుంటామని తెలిపింది. అక్రమ రవాణాకు పాల్పడే ముఠాలపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సంబంధిత శాఖలతో సమన్వయంగా పనిచేస్తామని పేర్కొంది.

**దేశవ్యాప్త ఉద్యమం..**

న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో నిర్వహించిన "బాలల హక్కులు, సామర్థ్యం, సమృద్ధిని నిర్ధారించడం" అంశంపై జరిగిన జాతీయ సదస్సులో ఈ ప్రచారాన్ని ప్రారంభించారు. 2030 నాటికి భారత్‌ను బాలల అక్రమ రవాణా రహిత దేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా 250కి పైగా స్వచ్ఛంద సంస్థలతో కూడిన జీ=జ ఈ ఉద్యమాన్ని నడిపిస్తోంది. ఏప్రిల్-2023 నుంచి డిసెంబర్-2025 వరకు దేశవ్యాప్తంగా

## విద్యార్థులకు నాణ్యమైన


# భోజనం ఇవ్వాలి

-బొందలపల్లి పాఠశాలలను తనిఖీ చేసిన డీఈఓ
-విద్యా ప్రమాణాలతో పాటు ఆరోగ్యంపై దృష్టిసారించాలి
-డి ఈ ఓ రమేష్ కుమార్



## విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

-లీగల్ సర్వీసెస్ అథారిటి సెక్రటరీ ఏ.శ్రీదేవి



**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 01 (ప్రజా జ్యోతి)** రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూల్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమమాన్ని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మరియు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలోనిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెక్రెటరీ డిస్టిక్

## పెండింగ్ కేసుల దర్యాప్తు

# వేగవంతం చేయాలి

- నిర్ణీత గడువులోగా ఛార్జ్‌షీట్లు దాఖలు చేయాలి: జిల్లా ఎస్పీ జానకి




**మహబూబ్‌నగర్, ఆగస్టు 1 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా ఛార్జ్‌షీట్లు దాఖలు చేయాలని జిల్లా ఎస్పీ దరావత్ జానకి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో కోర్టు డ్యూటీ అధికారులు, కోర్టు లైజన్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎస్పీ ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ హౌస్ అధికారులు (ఎస్‌హెచ్‌వోలు) ఆన్‌లైన్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, ఛార్జ్‌షీట్ల దాఖలు, కోర్టు విచారణల సమన్వయం, పెండింగ్ కోర్టు వ్యవహారాలపై

# విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

లీగల్ సర్వీసెస్ అథారిటీ ఏ.శ్రీదేవి హాజరయ్యారు.ఈ సందర్భంగా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులను ద్దేశించి మాట్లాడుతూ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు పిల్లలను సరైన మార్గంలో నడపించడానికి ఒక గొప్ప అవకాశమని అన్నారు.నేటి బాలలే రేపటి భారత పౌరులు కాబట్టి పిల్లలను బాల్య దశనుంచే ఉన్నతమైన విలువలతో, సరైన మార్గంలో తీర్చి దిద్దాలని, చైల్డ్ ప్రొటెక్షన్ పిల్లల హక్కుల్ని కాపాడటానికి,బాల కార్మికులు, హింస లేదా వేధింపులకు గురైన పిల్లలను రక్షించడానికి మరియు వారికి న్యాయం అందించడానికి బాధ్యత వహిస్తారని,బాలల చట్టాలపై అవగాహన కల్పించడం,ఆపదలోఉన్న పిల్లలను ఆదుకోవడంమరియు పునరావాసం కల్పించి ఆపదలో ఉన్నా నిరాశ్రయులైన,హింసకు గురైన పిల్లలను గుర్తించి తక్షణ రక్షణ కల్పిస్తారని,పాఠశాలల్లో,సమాజంలో పిల్లల హక్కులు,చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం,పోలీసు,శిశు సంక్షేమ కమిటీ, ఇతర అధికారులతో కలిసి పనిచేసి బాధితులకు సహాయం అందించడం,నిరాశ్రయులైన పిల్లలకు ఆశ్రయం,విద్య మరియు వైద్య సేవలు అందేలా చూడాలి,బడుల్లో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు ప్రతి పాఠశాల యందు వారానికి ఒక సారి అవగాహన కార్యక్రమం నిర్వహించి,బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలోఎన్. శ్రీనిధి సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి,పాండు నాయక్ ఇంచార్జి డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ అధి కారి,మానిటరింగ్ అధికారి కిరణ్ కుమార్,డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య,చైల్డ్ వెల్ఫేర్ శాఖ అధికారులు,జువెనైల్ జస్టిస్ బోర్డు అధికారులు,ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 2030 నాటికి బాలల అక్రమ రవాణా రహిత భారత్ లక్ష్యం

1,22,516 మంది పిల్లలను అక్రమ రవాణా నుంచి రక్షించినట్లు వెల్లడించారు.

కేంద్ర మంత్రి ప్రశంసలు

కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ మాట్లాడుతూ, పిల్లలను అక్రమ రవాణా, లైంగిక దోపిడీ నుంచి రక్షించడంలో స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ఒక్క చిన్నారి ప్రాణాన్ని కాపాడినా అది అత్యంత పవిత్రమైన సేవ అని పేర్కొన్నారు. రూరల్ డెవలప్మెంట్ సొసైటీ డైరెక్టర్ చిన్నమ్మ థామస్ మాట్లాడుతూ, బాలల అక్రమ రవాణా దేశంలో అత్యంత తీవ్రమైన సామాజిక సమస్యగా మారిందన్నారు. ఉద్యోగాలు, విద్య పేరుతో పేద కుటుంబాల పిల్లలను మోసగించి లైంగిక దోపిడీ, బాల కార్మిక వ్యవస్థలోకి నెట్టేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగంతో కలిసి ప్రమాదంలో ఉన్న కుటుంబాలకు రక్షణ కల్పించి, రక్షించబడిన పిల్లలకు సమగ్ర పునరావాసం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలి

నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 01 (ప్రజా జ్యోతి)

అనాథలు, వలస కార్మికుల పిల్లల పట్ల మరింత బాధ్యతతో వ్యవహరించాలని ఉపాధ్యాయులకు డిఇఓ సూచించారు.నాగర్ కర్నూల్ మండల పరిధిలోని బొందలపల్లి అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల,యూఆర్ఎస్(అర్బన్ రెసిడెన్షియల్) పాఠశాల,ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి ఏ.రమేష్ కుమార్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలల విద్యా ప్రమాణాలు, విద్యార్థుల అభ్యాసనైపుణ్యాలు,ఉపాధ్యాయుల బోధన తీరు,హాజరు,మధ్యాహ్న భోజన నిర్వహణ,విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు ఆరోగ్యం,పోషకాహారం, భద్రతపై కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.ముందుగా అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి పాఠ్యాంశాలపై అవగాహన, చదివే సామర్థ్యం,రాత నైపుణ్యం,ప్రశ్నలకు సమాధానాలు చెప్పే విధానాన్ని పరిశీలించి విద్యా ప్రమాణాలను అంచనావేసి ప్రతి విద్యార్థి అభ్యాస స్థాయిని గుర్తించి,వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన అందించాలని,విద్యార్థులలో నేర్చుకునే ఆసక్తిని పెంపొందించేలా బోధన కొనసాగించాలని అన్నారు.రెగ్యులర్గా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం,విద్యార్థులకు పోషకాహారం అందించడం, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడం,వ్యక్తి గత పరిశుభ్రతపై అవగాహన కల్పించడం వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆరోగ్యంగా ఉన్న విద్యార్థులే విద్యలో మెరుగైన ఫలితాలు సాధిస్తారని తెలిపారు.యూఆర్ఎస్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో ఎక్కువ మంది అనాథలు,వలస కార్మికుల పిల్లలు,ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన వారేనని అలాంటి విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు తల్లిదండ్రుల మాదిరిగా బాధ్యతతో వ్యవహరించాలని,వారికి చదువుతో పాటు ఆరోగ్యం,మానసిక స్థైర్యం,వ్యక్తిగత శ్రేయస్సుపై నిరంతరం శ్రద్ధ వహించాలని, ఎలాంటి సమస్యలున్నా వెంటనే గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.అనంతరంప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించిన డీఈఓ విద్యార్థులు,ఉపాధ్యాయుల హాజరు నమోదును పరిశీలించి విద్యార్థుల అభ్యాస ప్రమాణాలను పరీక్షించి బోధన నాణ్యతను మరింత మెరుగుపర్చేందుకు సూచనలు చేసి తరగతులు సమయానికి నిర్వహించడం,ప్రతి విద్యార్థికి వ్యక్తిగత శ్రద్ధతోబోధన అందించి ఫలితాలను మెరుగు పర్చాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన నాణ్యత,వంట శాల పరిశుభ్రత, మెనూ ప్రకారం భోజనం అంది స్తున్నారా,విద్యార్థులకు సరిపడా పోషకాహారం అందుతున్నదా అనే అంశాలను పరిశీలించి సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు.ప్రభుత్వనిబంధనలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి ఆహారనాణ్యతలో రాజీ పడకుండా నాణ్యమైన విద్య,ఆరోగ్యం,పోషకాహారం, పరిశుభ్రత వంటి అంశాలపై సమానదృష్టి సారిస్తేనే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అన్నిరంగాలలో రాణిస్తారనిఅన్నారు.ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ విద్యార్థుల భవిష్యత్తులో కీలక పాత్ర పోషించాలని సూచించారు.

# పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

సమగ్రంగా సమీక్షించారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి, ఛార్జ్‌షీట్లు, సంబంధిత పత్రాలను సకాలంలో కోర్టులకు సమర్పించాలని ఎస్పీ సూచించారు. అలాగే కేసులకు సంబంధించిన అవసరమైన రికార్డులను నిర్ణీత సమయంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కోర్టు విచారణల సమయంలో సాక్షులను సకాలంలో హాజరుపరచడం, దర్యాప్తు అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులు, కోర్టు లైజన్ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయడం ద్వారా నిందితులకు శిక్ష పడేలా, బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా కృషి చేయాలని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ నర్సింహులు, ఐటీ సెల్ సబ్‌ఇన్‌స్పెక్టర్ రవి, కోర్టు డ్యూటీ అధికారులు, కోర్టు లైజన్ అధికారులు, ఐటీ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

# వృద్ధులకు సేవాలు అందించడం మానవత్వానికి నిదర్శనం

## వృద్ధాశ్రమాల నిర్వహణలో సేవాభావం సమాజానికి ఆదర్శం

## డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఏ.శ్రీదేవి

కల్వకుర్తి ఆగస్టు 1 (ప్రజా జ్యోతి)

సమాజంలో వృద్ధులను గౌరవించడం, వారికి ప్రేమతో సేవలు అందించడం ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత అని నాగర్‌కర్నూల్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ఏ.శ్రీదేవి అన్నారు. వృద్ధాశ్రమ నిర్వహణలో సేవాభావంతో పనిచేస్తు సమాజానికి నిజమైన ఆదర్శంగా నిలవడం ప్రశంసనీయమని పేర్కొన్నారు.కల్వకుర్తి పట్టణంలో డి.డబ్ల్యూ. ఓ మరియు ప్రజల భాగస్వామ్య సంస్థ ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమాన్ని డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఏ.శ్రీదేవి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ఉన్న వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులు, రోజువారీ అవసరాలు, జీవన పరిస్థితులను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా న్యాయసేవల సంస్థ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.అనంతరం వృద్ధాశ్రమ నిర్వాహకులు పి. వెంకటయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో డి ఎల్ ఎస్ ఏశ్రీదేవి మాట్లాడుతూ, వృద్ధులకు సురక్షితమైన, శాంతియుతమైన వాతావరణం కల్పించడం అత్యంత గొప్ప సేవ అని అన్నారు. నాణ్యమైన ఆహారం, సమయానుకూల వైద్య సేవలు, పరిశుభ్రమైన నివాస వసతులు అందించడం ద్వారా వృద్ధుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. వృద్ధులను కుటుంబ సభ్యుల్లా చూసుకోవడం సంస్కృతిలో ఉన్న అత్యున్నత విలువ అని ఆమె గుర్తుచేశారు.

తల్లిదండ్రులు, వృద్ధుల పట్ల ప్రేమ, గౌరవం చూపడం ప్రతి కుటుంబ బాధ్యత అని శ్రీదేవి పేర్కొన్నారు. వృద్ధుల హక్కుల పరిరక్షణకు లీగల్ సర్వీసెస్ అథారిటీ నిరంతరం కృషి చేస్తుందని, అవసరమైన ప్రతి వృద్ధునికి ఉచిత న్యాయ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉందని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు పి వెంకటయ్య,వృద్ధాశ్రమ కోఆర్డినేటర్ పి. పద్మ, సిబ్బంది, వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులు పాల్గొన్నారు.




# కొనసాగుతున్న పి ఆర్ టి యు సభ్యత్వ నమోదు కార్యక్రమం

**నర్వ, ఆగస్టు 01: ప్రజా జ్యోతి**

నర్వ మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్‌టీయూ పి ఆర్ టి యు,) సభ్యత్వ నమోదు కార్యక్రమం రెండో రోజు శనివారం అత్యంత ఉత్సాహంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు సూరం వెంకటేష్ మాట్లాడుతూ.... ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం ఒక్క పీఆర్‌టీయూ సంఘంతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా ఉపాధ్యాయుల హక్కుల కోసం, న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక సంఘం పీఆర్‌టీయూ అని ఆయన కొనియాడారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న పీఆర్‌టీయూలో సభ్యత్వం పొందడం ఒక వరం లాంటిదని, ప్రతి ఉపాధ్యాయుడూ ఈ సంఘంలో భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు. భవిష్యత్తులోనూ ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామని,ఉపాధ్యాయులకు ఎల్లప్పుడూ సంఘం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పీఆర్‌టీయూ అధ్యక్షులు సూరం వెంకటేష్, ప్రధాన కార్యదర్శి గోదల హరీష్, గౌరవ అధ్యక్షులు రాఘవ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు మల్లేష్,జిల్లా నాయకులు వేణుగోపాల్ రెడ్డి, ఉస్మాన్, జనార్దన్,వీరేష్ బాబు,రవికుమార్,నాగరాజు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బషీర్,నరేష్, శిరీష,రాయల్ హన్నా, ప్రదీప్, షర్ఫుద్దీన్,ప్రవీణ్,ఉపాధ్యాయులు రఘువర్మ, విష్ణు, స్వాతి,తస్లీమ్, శ్రీనిత్య,నాగలక్ష్మి,అనిత,నాగేష్ బాబు, వీరేష్ బాబు, రవికుమార్,రాధారాణి,నర్మద,బాధ్యులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఒప్పంద సేవకులకు ఇకనుండి ఒకటవ తేదినే జీతాలు

**-రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన**
**-హర్షం వ్యక్తం చేసిన రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల రవిశంకర్**

నాగర్ కర్నూల్ : ఆగష్టు 01 (ప్రజా జ్యోతి)
ఒప్పంద,పొరుగు సేవల ఉద్యోగులకు ప్రతినెల ఒకటినే జీతం అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల తెలంగాణ రాష్ట్ర ఒకేషనల్ క్వాలిఫైడ్ కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది.గత 20 సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియక సుమారు రెండు దశాబ్దాలకు పైబడి కష్టాలు అనుభవిస్తూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభ్యున్నతికి పాటుపడిన ఒప్పంద అధ్యాపకులకు ప్రతినెల ఒకటినే ప్రజాప్రభుత్వంజీతాలు అందివ్వడం పట్ల తెలంగాణ రాష్ట్ర ఒకేషనల్ క్వాలిఫైడ్ కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్రఅధ్యక్షుడు ఆకుల రవిశంకర్ హర్షం వ్యక్తం చేశారు.కాంట్రాక్ట్,ఔట్ సోర్సింగ్ వ్యవస్థలు మొదలైనప్పటి నుండి నేటి వరకు ఏ ఉద్యోగి ప్రతినెలా ఒకటవ తేదిన జీతాలు అందుకోలేద ని,ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మనసు పెట్టీ ఆలోచించి ఏ ముఖ్యమంత్రి చేయని సాహసోపేత నిర్ణయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుని తమకు సహాయం చేశారని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఒప్పంద,పొరుగు సేవలు మరియు చిరుద్యోగుల తరుపున రాష్ట్ర ప్రభుత్వానికి ఆకుల రవిశంకర్ కృతజ్ఞతలు తెలిపి,వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేసే ప్రతీ చిరుద్యోగి కుటుంబం ఆనందంతో గడపాలని, ప్రతీ ఒక్కరూ అప్పుల పాలవ్వకుండాఆత్మగౌరవంతో బ్రతకాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతీ నెలా ఒకటినే జీతాలు ఉద్యోగులకు చెల్లిస్తుండటంతో వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేసే లక్షలమంది చిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.పిల్లల స్కూల్ ఫీజుల కిరాణా కొట్టు ఖర్చులకు డబ్బులు లేక అప్పుల పాలవుతూ ఏండ్ల తరబడి కుటుంబాలను నెట్టుకొస్తున్న కాంట్రాక్ట్,ఔట్ సోర్సింగ్ చిరు ఉద్యోగుల జీవితాలలో ఆనందం నింపేలా ముఖ్యమంత్రి జీతాల చెల్లింపు నిర్ణయం తీసుకోవడం శుభపరిణామని రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెల ఒకటవ తేదీనే జీతాలు చెల్లిస్తుండటంతో సుమారు



ఐదు లక్షల మంది చిరుద్యోగుల కుటుంబాలలో ఆనందం వెల్లివిరుస్తోంది.సుమారు ఇరవై సంవత్సరాల నుండి ఎప్పుడు జీతం వస్తుందో తెలియక ఖాళీ కడుపుతో అప్పుల పాలవుతూ జీవితాన్ని నెట్టుకొస్తున్న ఉద్యోగుల కష్టాన్ని గుర్తించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చిరుద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని మరో మారు నిరూపించుకుందని,తమకు ఒకటవ తేదీన జీతాలు ఇప్పించిన ఆర్థికశాఖ మాత్యులు మల్లు భట్టి విక్రమార్క,తెలంగాణ విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ,ఇంటర్ విద్యా కమిషనర్ కు వివిధ జిల్లాల అధికారులు,కళాశాలల ప్రిన్సిపాల్లు, కళాశాలల నాన్ టీచింగ్ సిబ్బందికి,రాష్ట్ర ఒకేషనల్ క్వాలిఫైడ్ కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ తరపున పేరుపేరునా ఆకుల రవిశంకర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిగా బి. నర్సింహులు బాధ్యతల స్వీకరణ

**- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను**
**మర్యాదపూర్వకంగా కలిసిన నూతన సి.పి.ఓ**

**మహబూబ్‌నగర్, ఆగస్టు 1 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
మహబూబ్‌నగర్ జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి (సి.పి.ఓ)గా బి. నర్సింహులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. గణాంక శాఖ డైరెక్టర్, హైదరాబాద్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆయనకు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించబడ్డాయి.
ఇటీవల జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కె. రవీందర్ జూలై 31న పదవీ విరమణ చేయడంతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేస్తూ, ప్రస్తుతం జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయంలో గణాంక అధికారిగా విధులు నిర్వహిస్తున్న బి. నర్సింహులను సి.పి.ఓగా నియమించారు.
బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి బి. నర్సింహులు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రణాళిక,



గణాంక విభాగాల పనితీరును మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.నూతన సి.పి.ఓగా బాధ్యతలు చేపట్టిన నర్సింహులకు జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, గణాంక శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అభినందనలు తెలియజేస్తూ, వారి పదవీకాలం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

## కేజీబీవీ బాలానగర్‌లో నివారణాత్మక పాఠశాల ఆరోగ్య పరీక్ష కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా విద్యాశాఖాధికారి ఐ. విజయకుమారి

**మహబూబ్ నగర్ ఆగస్ట్ 1 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో శనివారం నిర్వహించిన నివారణాత్మక పాఠశాల ఆరోగ్య పరీక్ష కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖాధికారి ఐ. విజయకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షల తీరును పరిశీలించి, వైద్య బృందం చేపడుతున్న సేవలను అభినందించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి నివారణాత్మక ఆరోగ్య పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఎత్తు , బరువు, బాడీ మాస్ ఇండెక్స్, రక్తపోటు, రక్తంలో ఆక్సిజన్ స్థాయి, శరీర ఉష్ణోగ్రత వంటి ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.అదేవిధంగా సాధారణ ఆరోగ్య స్థితి, పోషకాహార స్థితి, చెవి, కంటి, ఎదుగుదల సంబంధిత పరీక్షలతో పాటు దంత పరీక్ష, వినికిడి పరీక్ష, దృష్టి పరీక్ష, మానసిక మరియు నాడీ-అభివృద్ధి మూల్యాంకనాలను కూడా వైద్య నిపుణులు చేపట్టారు.ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడిందని, విద్యార్థులు సమగ్ర ఆరోగ్య పరీక్షలతో పాటు వైద్య బృందం అందించిన ఆరోగ్య అవగాహన సూచనల ద్వారా కూడా ప్రయోజనం పొందారని జిల్లా విద్యాశాఖాధికారి ఐ. విజయకుమారి తెలిపారు.



## తల్లిపాలే శిశువుకు అత్యంత శ్రేయస్కరం

**-ఘనంగా పదవ సెంటర్లో తల్లిపాల వారోత్సవాలు**





**నాగర్ కర్నూల్ ఆగస్టు 01 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి )**
తల్లిపాలే శిశువుకు అత్యంత శ్రేయస్కరమని సూపర్వైజర్ సువర్ణ స్పష్టం చేశారు. శనివారంఅచ్చంపేట మున్సిపల్ శనివారంకేంద్రంలోని 10వ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంగన్‌వాడీ సూపర్వైజర్ సువర్ణ హాజరై, గర్భిణీ స్త్రీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డబ్బా పాల కంటే తల్లిపాలే శిశువులకు అత్యంత శ్రేయస్కరమని, బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో..ఉపయోగపడతాయని పేర్కొన్నారు. తల్లిపాలలో పోషకాలు సమృద్ధిగా ఉండటంతో పాటు శిశువుకు వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తాయని ఈ సందర్భంగా ఆమె వివరించారు.
అనంతరం 7నెలల నుండి 3 సంవత్సరాల పిల్లల తల్లులకు గుడ్లు, బాలామృతం, పౌష్టికాహారానికి సంబంధించిన అంగన్‌వాడీ ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హబ్బు వెంకటమ్మ, అంగన్‌వాడీ టీచర్ సంధ్య,గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## అడ్డాకల్ పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి

**మహబూబ్‌నగర్, ఆగస్టు 1 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు శనివారం అడ్డాకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఫార్మసీ, కాన్పుల గది, ప్రయోగశాల (ల్యాబ్)తో పాటు వివిధ విభాగాలను పరిశీలించి, అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి ఆవరణతో పాటు లోపలి గదులను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు కాన్పులు, బయటి రోగుల (ఓపీ) చికిత్సలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. శశికాంత్, హెల్త్ ఎడ్యుకేటర్లు హన్మంతు, నర్సింహా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# మహిళలు, చిన్నారుల భద్రతకు షీ టీమ్స్

## -- యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ అప్రమత్త సేవలు
## - ఫిర్యాదులపై తక్షణ స్పందన.. అవగాహనతో పాటు కఠిన చర్యలు: జిల్లా ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్, ఆగస్టు 1 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ షీ టీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ద్వారా నిరంతరం నిఘా, అవగాహన కార్యక్రమాలు, చట్టపరమైన చర్యలు చేపడుతోందని జిల్లా ఎస్పీ దరావత్ జానకి, ఐపీఎస్ తెలిపారు. ప్రజలు షీ టీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సేవలను సద్వినియోగం చేసుకొని మహిళలు, పిల్లల భద్రతకు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.
షీ టీమ్స్‌కు ఇప్పటివరకు 37 ఫిర్యాదులు అందగా, 35 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి, 32 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అలాగే 11 ఈ-పెట్టీ కేసులు నమోదు చేయడంతో పాటు 28 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, 75 హాట్‌స్పాట్ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, తెలంగాణ మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, గుడ్ టచ్--బ్యాడ్ టచ్, సెల్ఫ్ డిఫెన్స్, సోషల్ మీడియా భద్రత, మహిళలు--పిల్లల రక్షణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, రద్దీ ప్రాంతాల్లో సివిల్ డ్రస్‌లో ప్రత్యేక నిఘా కొనసాగుతోంది.ఎవరైనా మహిళలు, బాలికలను వేధించినా, వెంబడించినా లేదా అసభ్యంగా ప్రవర్తించినా వెంటనే డయల్--100 లేదా జిల్లా షీ టీమ్ నంబర్ 8712659365కు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇక యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో 12 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా బాల కార్మికులను రక్షించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరిచి, యజమానులపై కేసులు నమోదు చేశారు. రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు మైనర్ చిన్నారులను వారి తల్లిదండ్రుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. మానవ అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ నివారణలో భాగంగా 70 హాట్‌స్పాట్ ప్రాంతాలను తనిఖీ చేశారు. మానవ అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, అక్రమ దత్తత వంటి నేరాల నివారణకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఎస్పీ తెలిపారు. మైనర్ పిల్లలను పనిలో పెట్టుకోవడం, బాల్య వివాహాలు జరపడం, పిల్లలను కొనుగోలు--అమ్మకాలు చేయడం, అక్రమ దత్తతలు చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. పిల్లలను దత్తత తీసుకోవాలనుకునేవారు ప్రభుత్వ నిబంధనల ప్రకారమేదరఖాస్తు చేసుకోవాలని సూచించారు.మహిళలు, బాలికలు, చిన్నారులకు సంబంధించిన నేరాలు, మానవ అక్రమ రవాణా లేదా బాల కార్మిక వ్యవస్థపై సమాచారం తెలిసిన వెంటనే డయల్--100, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ హెల్ప్‌లైన్: 8712680066 లేదా చైల్డ్ హెల్ప్‌లైన్: 1098కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని జిల్లా ఎస్పీ జానకి తెలిపారు.




# ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చలో ఇందిరా పార్క్



**గండీడ్, ప్రజాజ్యోతి:**
ఉపాధ్యాయులు, విద్యారంగ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర శాఖ పిలుపుమేరకు శనివారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన రాష్ట్రవ్యాప్త మహాధర్నాలో గండీడ్ మండల తపస్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా 317 జీవోను రద్దు చేయడం, నూతన పెన్షన్ విధానం (సీపీఎస్) స్థానంలో పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయడం, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏ బకాయిలు చెల్లించడం, పీఆర్సీ అమలు, ఉపాధ్యాయుల రేషనలైజేషన్‌ను పారదర్శకంగా చేపట్టడం, కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడం, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్)ను సమర్థవంతంగా అమలు చేయడం, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం, 2008 డీఎస్సీ ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించడం వంటి పలు డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ మహాధర్నాకు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పాలమూరు జిల్లా తపస్ అధ్యక్షుడు రామ్ గోపాల్, గండీడ్ మండల శాఖ అధ్యక్షుడు అంజిలయ్య, సికిందర్, రమేష్, కుల్కచర్ల మండల అధ్యక్షుడు స్వయం ప్రకాష్, శ్రీనివాస్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# శ్రీశనేశ్వర స్వామికి తిలతైల అభిషేక పూజలు

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 01 (ప్రజా జ్యోతి)**
శ్రీపరాభవ నామ సంవత్సరం ఆషాడమాస క్రిష్ణపక్షం తదియ,చవితి శనివారం దైవ నక్షత్రము శనివారం బిజినేపల్లి మండలం పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో గల శ్రీ శనేశ్వర స్వామికి భక్తులచే శనిగ్రహదోష నివారణకు స్వామివారికి తిలతైలా అభిషేకాలు భక్తిశ్రద్ధలతో వేదమంత్రచ రణల మధ్య వైభవంగా జరిగాయి. శ్రీసార్థాసప్త జేష్టమాత సమేత శనేశ్వర స్వామికి ప్రత్యేకంగాతిలతైల అభిషేకాల పూజలు నిర్వహించారు,ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్.గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ ఈ మాసంలో స్వామివారిని కొలిచినచో అత్యధిక సంతృప్తి పొంది విశేష ఫలితాన్ని భక్తులకు ఇస్తారని అన్నారు.ప్రతి ఒక్కరు జన్మ రిత్యా,గోచార రీత్యా శనిగ్రహ దోష నివారణకు స్వామివారిని శక్తిమేరకు పూజించాలని అన్నారు.ఆలయంలో గోన బుద్దారెడ్డి కాలంనాటి బ్రహ్మసూత్రంగల పరమశివునికి భక్తులచే రుద్రాభిషేక పూజలు,అర్చన లు,దీపారాధన నందీశ్వర స్వామి వారికి ప్రత్యేక అర్చనపూజలు భక్తులచే నిర్వహించి అనంతరం భక్తులకు వేదఆశీర్వచనం తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం లో ఆలయ ఆలయ చైర్మన్‌వెల్దండ గోపాల్ రావు,గ్రామ సర్పంచ్,సుగుణమ్మ,కమిటీ సభ్యులు కెంచె రాజేష్,ప్రభాకరచారి, పుల్ల య్య,వీర శేఖరాచారి,శ్రీకాంత్ రెడ్డి,అర్చకులు శాంతి కుమార్,ఉమమహేశ్వర్, సిబ్బంది గోపాల్ రెడ్డి భక్తులు,మహిళలు పాల్గొన్నారు.



# జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు
## ఆనంద్ కుమార్ గౌడ్

**మహబూబ్‌నగర్, ఆగస్టు 1( ప్రజా జ్యోతి బ్యూరో ):**
తన జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యక్షంగా, ఫోన్ కాల్స్, సందేశాలు, సోషల్ మీడియా వేదికల ద్వారా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన నివాసానికి విచ్చేసి వేద పండితుల ఆశీర్వచనాలు అందించిన పండితులకు, ఆప్యాయంగా శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, పత్రికా విలేకరులకు, బీసీ జేఏసీ నాయకులకు, యూత్ కాంగ్రెస్ నాయకులకు, వివిధ రాజకీయ, సామాజిక సంస్థల ప్రతినిధులకు, శేషాద్రి నగర్ వాసులకు, మిత్రబృందానికి, శ్రేయోభిలాషులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.
అలాగే ఫోన్ కాల్స్, సందేశాలు, సోషల్ మీడియా ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరి ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. మీ అందరి ప్రేమ, ఆదరణ, ఆశీర్వాదాలు తనలో మరింత బాధ్యతను, సేవాభావాన్ని పెంపొందించేలా ప్రేరణనిస్తున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజాసేవలో మరింత నిబద్ధతతో పనిచేస్తూ, అందరి ఆశీస్సులు, సహకారం ఎల్లప్పుడూ తనపై ఉండాలని ఆకాంక్షించారు. చివరగా, "పేరుపేరునా ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు" అంటూ మరోసారి అందరికీ ధన్యవాదాలు తెలిపారు.



# సీఎం సొంత మండలంలోని ఇతర పార్టీ శ్రేణులకు అందని కళ్యాణ లక్ష్మి

**వంగూరు ఆగస్టు 1 (ప్రజా జ్యోతి)**
నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండలం లో ఇవాళ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యాలయంలోమాట్లాడుతూ ఇతర పార్టీ కార్యకర్తలకు కళ్యాణ లక్ష్మీ పథకానికి సంతకం అచ్చంపేట కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే చిక్కుడు వంశీ కృష్ణ సంతకం పెట్టమని అడిగితే తర్వాత పెడతాను అని స్థానిక ఎమ్మెల్యే దాటవేస్తున్నాడు. దీంతో కళ్యాణ లక్ష్మి పథకం పేదలకు అందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యమంత్రి గారి సొంత మండలం లోనే ఇలా ఉంటే వేరే ప్రాంతాల్లో పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అలాగే స్టేట్ ఫైనాన్స్ కమిషనర్ గ్రాంట్ ను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖకు 33 వేల కోట్ల బడ్జెట్ ను కేటాయించడం జరిగింది స్టేట్ ఫైనాన్స్ కమీషనర్ నుండి రావాల్సిన గ్రాంట్ ను వెంటనే గ్రామపంచాయతీలకు విడుదల చేయాలని డిమాండ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో డిండి చింతపల్లి సర్పంచ్ రామ్ భీమ్య, గాజర సర్పంచ్ శ్రీపతిరావు.పోల్కంపల్లి సర్పంచ్ అంకు నారమ్మ, నిజామాబాద్ సర్పంచ్ లక్ష్మమ్మ, ఉల్పర సర్పంచ్ కృష్ణయ్య, జాజాల సర్పంచ్ జిలకర కాశమ్మ ...., సర్వారెడ్డిపల్లి తండా సర్పంచ్ జీవన్........మరియు పార్టీ నాయకులు,గణేష్ రావు.మంద రాజేందర్ రెడ్డి.అంకు సురేందర్. అంకురి ఆంజనేయులు. ఎల్లా గౌడ్.పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పుట్టిన బిడ్డకు మొదటి టీకా తల్లిపాలు

## -బిడ్డకు తల్లిపాలు సంపూర్ణ ఆహారం
## -జిల్లా వైద్యాధికారి డాక్టర్ కే.కృష్ణ

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 01 (ప్రజా జ్యోతి)**

గర్భవతి ప్రసవించిన వెంటనే పుట్టిన బిడ్డకు ఒక గంటలోపే తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వడం ఒక టీకా తో సమానమని బిడ్డకు ఆరు నెలల వరకు నీళ్ల విరోచనాలు,న్యుమోనియా తదితర అంటూ వ్యాధులు రాకుండా కాపాడుతాయిని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్. కే.కృష్ణ తెలిపారు.శనివారం ప్రపంచ తల్లి పాల వారోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గర్భవతులు బాలింతలకు అవగాహన సమావేశము నిర్వహించి ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే.కృష్ణ మాట్లాడుతూ గర్భవతి ప్రశ్నించిన తర్వాత పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలను పట్టించి ఎట్టి పరిస్థితులు తేనే,చక్కెర,గ్లూకోస్ నీరు లాంటి పానీయాలు ఇవ్వవద్దని, తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ ఆహారమని మొదటి మూడు రోజుల తల్లిపాలలో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరగడానికి దోహదపడుతుందని,బిడ్డ పుట్టిన 48 గంటల తర్వాత కొంతమంది పిల్లలు వచ్చే ఫిజిలాజికల్ జాండీస్ తీవ్రత తగ్గుతుందని,తల్లి బిడ్డకు మధ్య అనుబంధం పెరిగి బిడ్డలకు భద్రతభావం పెరుగుతుందన్నారు.బిడ్డకు మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలను మాత్రమే ఇవ్వాలి,తల్లిపాలు ఇవ్వడంవల్ల బిడ్డకు భవిష్యత్తులో అధిక రక్తపోటు,మధుమేహం,ఊబకాయం బారిన పడకుండా నివసించగలుగుతారని ఆరు నెలల తర్వాత అదరపు ఆహారాన్ని తల్లిపాలతో పాటు ప్రారంభించాలని,తల్లిపాలు ఇవ్వడం వలన తల్లికి అండాశయ మరియు బ్రెస్ట్ క్యాన్సర్, ఎముకలు పేలుసు బారడం(ఆస్టియో పోరోసిస్)




తదితర అనారోగ్య సమస్యల బారిన పడకుండా ఉండి తొందరగా బరువు తగ్గుతారని ఆరు నెలల వరకు మళ్లీ గర్భం దాల్చకుండా గర్భం నిరోధకంగా ఉపయోగపడుతుందన్నారు.అనంతరం జిజిహెచ్ గైనకాలజిస్ట్ డాక్టర్ సౌమ్య మార్లడుతూ బాలింతల్లో పాలు బాగా రావడానికి తీసుకోవలసిన ఆహా.రము,ఎంత పరిమాణములో నీరు తీసుకోవాలో. తదితర విషయాలపై అవగాహన కలిగించారు.ఈకార్యక్రమంలో జి.జి.హెచ్ ఆర్.ఎం.ఓ డాక్టర్. రవిశంకర్,డాక్టర్ అజీజ్,పీడియాట్రిషన్ డాక్టర్.సిరాజుద్దీన్,ప్రోగ్రాం అధికారి డాక్టర్.సురేష్ బాబు, డాక్టర్కె.రవికుమార్,డిప్యూటీ డి.ఎం.హెచ్ ఓ.డాక్టర్. భరత్ కుమార్ రెడ్డి,వైద్యాధికారి డాక్టర్.సృజన,ఇన్ చార్జ్ సి.డి.పి.ఓ శోభారాణి,ఉప మాస్ మీడియా అధికారి రాజగోపాలచారి,డిపిఓ రేనయ్య,ఎ.పీ.ఓలు బాదం రాజేశ్వర్, కోట్రనిరంజన్,డి.వి.ఎల్.ఎంకుమార్,దివ్య,సూపర్వైజర్ మరియమ్మ,ఏఎన్ఎం నర్సింగమ్మ,హెల్త్ అసిస్టెంట్ తాళ్ల యాదగిరి,ఆశాకార్యకర్తలు మరియు అంగన్వాడీ టీచర్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# అమెరికాలో పెద్ది సుదర్శన్ రెడ్డికి ఘన నివాళులు

## - మేరీల్యాండ్‌లో పార్టీలకు అతీతంగా తెలంగాణ ప్రజాప్రతినిధుల సంతాప సభ

**మహబూబ్‌నగర్/మేరీల్యాండ్, ఆగస్టు 1 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో విశిష్ట పాత్ర పోషించిన ఉద్యమకారుడు, మాజీ ప్రజాప్రతినిధి పెద్ది సుదర్శన్ రెడ్డి మృతిపట్ల అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రంలో తెలంగాణ ప్రజాప్రతినిధులు, ప్రవాస భారతీయులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. రాజకీయాలకు అతీతంగా ఒకే వేదికపై చేరిన నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాల మౌనం పాటించి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.అమెరికన్ తెలుగు అసోసియేషన్ 19వ మహాసభల సందర్భంగా బాల్టిమోర్ నగరానికి వచ్చిన తెలంగాణకు చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమానికి పెద్ది సుదర్శన్ రెడ్డి అందించిన సేవలను స్మరించుకుంటూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో తనతో కలిసి ఎన్నో పోరాటాలు చేసిన ఆత్మీయ సహచరుడిని కోల్పోవడం తీవ్ర విషాదమని అన్నారు. ఉద్యమం కోసం వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి ప్రజల కోసం అహర్నిశలు శ్రమించిన అరుదైన నాయకుడిగా ఆయనను అభివర్ణించారు.



మాజీ మంత్రి లక్ష్మా రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమానికి సుదర్శన్ రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన నిబద్ధత, ప్రజల పట్ల అంకితభావం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు.శాసనసభ సభ్యులు రాజేందర్ రెడ్డి, అల్లా వెంకటేశ్వర్ రెడ్డి, శాసన మండలి సభ్యుడు కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తదితరులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ చరిత్రలో సుదర్శన్ రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని కొనియాడారు. శాసనసభలో ఒకే సభ్యుడిగా ఉన్నప్పటికీ హుందాతనం, విషయ పరిజ్ఞానం, ప్రజా సమస్యలపై ఆయన చూపిన చిత్తశుద్ధి అందరికీ ఆదర్శంగా నిలిచిందని గుర్తు చేశారు.ప్రవాస భారతీయ ప్రముఖులు మహేష్, గుండా అమర్‌నాథ్, భాను ఇల్లెందుల మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ యోధుల త్యాగాలను భావితరాలకు పరిచయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సుదర్శన్ రెడ్డి వంటి మహనీయుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని అన్నారు.సంతాప సభలో పాల్గొన్న నాయకులు, ప్రవాస భారతీయులు సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆయన ఆశయ సాధనకు కట్టుబడి పనిచేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు చిరస్మరణీయంగా నిలిచి, ప్రజాసేవకు ఆయన జీవితం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని సభలో ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డారు.

# వెల్లటూర్‌లో వారం రోజులుగా తాగునీటి కష్టాలు

## ఆరు బోర్లు అడుగంటినా పట్టించుకోరా?
## అధికారుల తీరుపై బీజేపీ ఫైర్

**చిన్నంబావి, ఆగస్టు 1 (ప్రజాజ్యోతి)**

చిన్నంబావి మండలం వెల్లటూర్ గ్రామంలో త్రాగునీటి ఎద్దడి కంటి నిండా నిద్ర.. కడుపు నిండా కూడు దొరక్కపోయినా భరించవచ్చేమో కానీ, తాగడానికి గుక్కెడు నీరు కూడా దొరకకపోతే ఆ నరకం వర్ణనాతీతం. ఇలాంటి గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్నారు. వారం రోజులుగా తాగునీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు అల్లాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ నాయకులు మండిపడ్డారు.ప్రజలు నీళ్ల కోసం ఇబ్బందులు పడుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.కాలనీల్లో బీజేపీ నేతల పర్యటన రాష్ట్ర బీజేపీ నాయకులు కురువ చిన్నమల్లయ్య, నాగర్‌కర్నూల్ జిల్లా జనరల్ సెక్రటరీ జగ్గారి శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు గ్రామంలోని వివిధ కాలనీల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యాదవుల కాలనీ, తెలుగువారి కాలనీ, వాల్మీకి కాలనీ, కాల్వకట్ట కాలనీ, ఎస్సీ కాలనీ, ఓసీ కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు.గ్రామంలో ఆరు బోర్లు అడుగంటిపోయినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం దారుణమన్నారు. అడుగంటిన బోర్ల స్థానంలో కొత్త బోర్లు ఏర్పాటు చేయాలని, చేతిపంపులకు మరమ్మతులు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తాత్కాలిక చర్యలతో సరిపెట్టకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.శిథిలావస్థలో వాటర్ ట్యాంక్ గ్రామంలోని వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరి పెచ్చులు ఊడిపడుతున్నాయని బీజేపీ నాయకులు తెలిపారు. ప్రజల దాహం తీర్చాల్సిన వాటర్ ట్యాంక్ ప్రమాదకరంగా మారడం ఆందోళనకరమన్నారు. పాత ట్యాంక్ స్థానంలో నూతన వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీడీవోకు వినతిపత్రం తాగునీరు, వాటర్ ట్యాంక్, వీధి దీపాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీవో ఆదర్శ గౌడ్, గ్రామ సర్పంచ్ బెక్కెం సుజాతమ్మ, ప్రతాప్‌రెడ్డికి బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. తాగునీటి సమస్యను ప్రాధాన్యంగా తీసుకుని త్వరలోనే పరిష్కార చర్యలు చేపడతామని అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.గ్రామ సర్పంచ్ స్పందిస్తూ.. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం నూతన వాటర్ ట్యాంక్ మంజూరుకు సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లి, మంజూరు కోసం తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.తక్షణమే తాగునీటి సమస్యను పరిష్కరించకపోతే ప్రజల తరఫున బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జగ్గారి శ్రీధర్‌రెడ్డి, కురువ చిన్నమల్లన్న, బొగ్గు కురుమయ్య, గణేష్‌రెడ్డి, మేఖల చెన్నయ్య యాదవ్, మద్దిలేటి, రాము, ఉమేష్ చంద్ర, వెంకటస్వామి, శివకుమార్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







# విబీజీ రామ్ జీ ఉద్యోగులకు పేస్కేల్ అమలు చేయాలి

## చిన్నంబావి మండలంలో పెన్డ్ డౌన్ షట్ డౌన్ తో నిరసన

**చిన్నంబావి ఆగస్టు 1(ప్రజాజ్యోతి)**

ఉపాధిహామీ స్థానంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విబీజీ రామ్ జీ పథకం ఉద్యోగులకు తగిన వేతన శ్రేణి (పే స్కేల్) మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర విబీజీ రామ్ జీ చిన్నంబావి మండలంలో ఉద్యోగులు పెన్ డౌన్, షట్ డౌన్ నిరసన చేపట్టారు.అనంతరం మండలం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా ఏపీఓ ధనుంజయ రాజు మాట్లాడుతూ, విబీజీ రామ్ జీ పథకంలో ప్రభుత్వం చేపడుతున్న పనులతో పాటు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో తాము కీలకంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను గడప వద్దకు చేరవేయడంలో నిరంతరం కృషి చేస్తున్నామని ఏపీవో పేర్కొన్నారు.అయినప్పటికీ తమకు తగిన వేతన శ్రేణి లేకపోవడంతో ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే ఈ నిరసన చేపట్టినట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విబీజీ రామ్ జీ ఉద్యోగులకు సమగ్ర వేతన శ్రేణిని మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ పరిష్కారమయ్యే వరకు శాంతియుతంగా పెన్ డౌన్, షట్ డౌన్ కార్యక్రమాలను కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు "మా సేవలకు గుర్తింపు కావాలి మా హక్కుగా పే స్కేల్ కావాలి" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ధనుంజయ రాజు, ఈసీ వెంకటేశ్వర్లు, టీఏలు గోపాల్ యాదవ్, ఈశ్వర్, స్వామి, ఆంజనేయులు, కంప్యూటర్ ఆపరేటర్లు శివయ్య, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

